నమస్తే తెలంగాణ
సిద్ధిపేట
I | హైదరాబాద్, ఆదివారం 21 ఏప్రిల్ 2024 | SIDDIPET

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న హరీశ్‌రావు

అనంతరావుపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న హరీశ్‌రావు

గజ్వేల్, ఏప్రిల్ 20: మండలంలోని అనంతరావుపల్లిలో శ్రీరేణుకాఎల్లమ్మ, మహంకాళి అమ్మవారు, దుర్గమ్మ, పోచమ్మ, మత్తడి పోచమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, బోనాల నాభిశీల ప్రతిష్ఠమహోత్సవానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీలు వెంకట్రామిరెడ్డి, డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జడ్పీటీసీ మల్లేశం, నాయకులు యాదగిరి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నవాజ్‌మీరా, రమేశ్‌గౌడ్, మహేందర్, శివకుమార్, కొమురయ్య పాల్గొన్నారు.

మెదక్ రోడ్‌షోలో సీఎం


మెదక్‌లో ర్యాలీలోపాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

మెదక్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ)/మెదక్ రూరల్, ఏప్రిల్ 20: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మెదక్ జిల్లాకేంద్రానికి వచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. మధ్యాహ్నం 1:16 గంటలకు హెలికాప్టర్ ద్వారా మెదక్ చర్చి కాంపౌండ్‌కు చేరుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు .అనంతరం ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ,కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహతో తో కలిసి రాందాస్ చౌరస్తా సభా వేదిక పైకి వచ్చారు. ఆయన 2.05 నుంచి 2.32 గంటల వరకు కార్నర్ రోడ్‌షో ప్రసంగించారు. 2.44కు సభావేదిక నుంచి బయల్దేరారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. ముదిరాజ్ బిడ్డ నీలం మధును గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పోతారంలో నియోజకవర్గ ముఖ్యనాయకులతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

మెదక్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే

కాంగ్రెస్ ప్రభుత్వంలో కర్షకులకు అన్నీ కష్టాలే..

- నమ్మితే నట్టేట ముంచిన కాంగ్రెస్, బీజేపీ
- పదేండ్లలో రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదు..
- ప్రజాసేవకుడు వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- పోతారంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

దుబ్బాక, ఏప్రిల్ 20: మెదక్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానేనని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ గెలుపును ఆపలేవని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ అందించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పోతారంలోని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్వగృహంలో నియోజకవర్గంలోని 8 మండలాల ముఖ్యనాయకులతో మాజీమంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా చర్చించారు. శాసనసభ ఎన్నికల మాదిరిగా నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు కష్టపడాలని సూచించారు. గ్రామాలతోపాటు మున్సిపాలిటీలో పార్టీశ్రేణులను కలుపుకుని ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ అందించడమే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు.

ప్రజలను మోసగించిన కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి..

రైతులను, పేదలను అష్టకష్టాలు పెడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని హరీశ్‌రావు సూచించారు. గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసగించిందని ధ్వజమెత్తారు. రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అకాలవర్షానికి ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ అందించాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని మోసగించిందన్నారు. ఓట్ల కోసం గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను మహిళలు నిలదీయాలన్నారు. దుబ్బాక ఉప ఎన్నికలో మోసపూరిత హామీలిచ్చిన రఘునందన్‌కు దుబ్బాక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో చెల్లుతుందా అని ప్రశ్నించారు. వెంకట్రామిరెడ్డిని నాన్‌లోకల్ అంటున్న రఘునందన్‌రావు గతంలో పటాన్‌చెరులో జడ్పీటీసీగా పోటీ చేయలేదా అని ప్రశ్నించారు. కరువు, కాటకాలకు కేరాఫ్‌గా నిలిచిన దుబ్బాకను కాళేశ్వరంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి దుబ్బాక నియోజకవర్గంలో భారీ మెజార్టీ అందిస్తామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో 25 రోజులు నా కోసం పని చేస్తే... ఐదేండ్లు మీ వెంట ఉంటూ సేవ లందిస్తానని ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్, మనోహర్‌రావు, రొట్టె రాజమౌళి, సోలిపేట సతీశ్‌రెడ్డి, దుబ్బాక మున్సిపల్ వైస్‌పర్సన్ వనితాభూంరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ నాయకులు

కేసీఆర్ పాలనలోనే పారిశ్రామిక ప్రగతి

సీఎం రేవంత్ నోటినుంచి పచ్చి అబద్ధాలు.. కేసీఆర్ హయాంలో సంగారెడ్డి జిల్లాకు రూ.28,181 కోట్ల పెట్టుబడులు

- 2572 పరిశ్రమల ఏర్పాటు, 1,88,191 మందికి ఉపాధి
- టీఎస్‌ఐపాస్ ద్వారా సులువుగా పరిశ్రమలకు అనుమతులు
- సుల్తాన్‌పూర్‌లో 250 ఎకరాల్లో మెడికల్ డివైజ్ పార్కు
- జహీరాబాద్‌లో ఇండిస్ట్రియల్ పార్కు, నిమ్జ్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు
- వెమ్ టెక్నాలజీస్, ట్రైటాన్, మహీంద్రా కంపెనీల భారీ పెట్టుబడులు
- సంగారెడ్డి జిల్లా నుంచి ఏటా రూ. 3వేల కోట్లకు పైగా ఎగుమతులు
- లింగంపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు
- సంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటును ప్రతిపాదించిన కేసీఆర్

కేసీఆర్ హయాంలో మెదక్‌లో నిర్మించిన నూతన కలెక్టరేట్

సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటైన మెడికల్ డివైజ్ పార్కులోని ఆకృతి పరిశ్రమ

సంగారెడ్డి, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో కేసీఆర్ హయాంలోనే పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. కేసీఆర్ పాలించిన తొమ్మిదిన్నరేళ్లలో సంగారెడ్డి జిల్లాకు 28,181 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించాయి. కేసీఆర్ సర్కార్ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ రోడ్‌షోలో విమర్శించారు. ఇందిరమ్మ హయాంలోనే జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, ఆ తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ పాలనలో సంగారెడ్డి జిల్లా పరిశ్రమల స్థాపనకు కేరాఫ్‌గా మారింది. పారిశ్రామిక పెట్టుబడుల్లో రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఫార్మా, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇతర పరిశ్రమలు సంగారెడ్డి జిల్లాలో పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి. 2014 నుంచి 2023 వరకు సంగారెడ్డి జిల్లాలో మొత్తం 2572 పరిశ్రమలు రూ. 28,161 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు అయ్యాయి. పరిశ్రమల ఏర్పాటు ద్వారా 1,88,191 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. జిల్లాలోని పరిశ్రమల నుంచి ఏటా సుమారు రూ.3వేల కోట్ల ఎగుమతులు జరిగాయి. రాష్ట్రంలో ఎగుమతులతో పోలిస్తే సంగారెడ్డి జిల్లా వాటా 19.53 శాతం ఉంది. అప్పటి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్‌లలో పలు పరిశ్రమలను ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లాలో ఫార్మా, బల్క్‌డ్రగ్ కంపెనీలు ఎక్కువగా ఏర్పాటయ్యాయి. కొత్తగా సంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటును కేసీఆర్ సర్కారు ప్రతిపాదించారు. మునిపల్లి మండలంలోని లింగంపల్లిలో487 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. కేసీఆర్ సర్కారు తన పాలనలో పటాన్‌చెరు నియోజకవర్గంలో ఐటీ టవర్‌ను నిర్మించాలని ప్రతిపాదించింది. ఐటీ టవర్ ఏర్పాటైతే సంగారెడ్డి జిల్లాలో ఐటీ రంగ పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి.

తొమ్మిదేళ్లలో రూ.28,181 కోట్ల పెట్టుబడులు

ఉమ్మడి రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లాలో 4306 పరిశ్రమలు స్థాపించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక సంగారెడ్డి జిల్లాలో 2572 పరిశ్రమలను కేసీఆర్ హయాంలో ఏర్పాటయ్యాయి. రూ.13,305 కోట్ల పెట్టుబడులతో 88 మెగా పరిశ్రమలు ఏర్పాటు చేశారు. రూ.6323 కోట్ల పెట్టుబడులతో 157 భారీ పరిశ్రమలు, రూ.3938 కోట్ల పెట్టుబడులతో 177 మధ్య తరహా పరిశ్రమలను పారిశ్రామిక వేత్తలు ఏర్పాటు చేశారు. రూ.4065 కోట్లతో 1085 చిన్న పరిశ్రమలు, రూ.548 కోట్ల పెట్టుబడులతో 1065 చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఆయా పరిశ్రమల ద్వారా 1,88,191 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. పరోక్షంగా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి. జహీరాబాద్‌లోని మహీంద్రా సంస్థ రూ.1000 కోట్లతో ఎలక్ట్రిక్ బ్యాటరీ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. సదాశివపేట లోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ రూ.1000 కోట్లతో కంపెనీ విస్తరణ చేపట్టింది. కోవలెంట్ ఫార్మా లేబరేటరీస్ రూ.708 కోట్లు, పిరమిల్ ఫార్మా కంపెనీ రూ.468 కోట్లు, అరబిందో ఫార్మా రూ.641 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. కార్వీ సోలార్ పవర్ సంస్థ రూ.151 కోట్లు, అక్షయ్ ఉర్జా కంపెనీ రూ.169 కోట్లు, ఓమిక్స్ కంపెనీ రూ.128 కోట్లు పెట్టుబడులు పెట్టాయి.

దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజ్ పార్కు ఏర్పాటు

మన్మోహన్ సింగ్ సర్కార్ హయాంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జహీరాబాద్‌లో నిమ్జ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్జ్ ఏర్పాటుకు అవసరమైన నిధులు సమకూర్చలేక పోయింది. దీంతో అందరూ నిమ్జ్ అటకెక్కుతుందని ఆందోళన చెందారు. కేసీఆర్ సర్కార్ జహీరాబాద్‌లో నిమ్జ్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చేపట్టడంతో పాటు పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించింది. కేసీఆర్ సర్కార్ పటాన్‌చెరు మండలం సుల్తాన్‌పూర్‌లో 250 ఎకరాల్లో రూ.1424 కోట్ల పెట్టుబడులతో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజ్ పార్కును ఏర్పాటు చేసింది. ఈ మెడికల్ డివైజ్ పార్కులో 50 పరిశ్రమలు ఏర్పాటు కాన్నాయి. ఈ పరిశ్రమలతో 7వేల మందికి ప్రత్యక్షంగా, 15వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనున్నది. మెడికల్ డివైజ్ పార్కులో 26 పరిశ్రమల వరకు ప్రారంభమయ్యాయి. గతేడాది మంత్రి కేటీఆర్ రూ.265 కోట్లతో ఏర్పాటైన ఏడు పరిశ్రమలను ప్రారంభించారు. రూ.530 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన సహజానంద మెడికల్ టెక్నాలజీస్ సంస్థను ప్రారంభించారు. మెడికల్ డివైజ్ పార్కులోని ఆకృతి ఆప్తాల్మిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఆకృతి సంస్థ మొత్తం 35 లక్షల కండ్ల అద్దాలను కంటివెలుగు కోసం ఉత్పత్తి చేసింది. మెడికల్ డివైజ్ పార్కుకు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా పారిశ్రామిక వేత్తల కోసం ఫిక్కీ ఫ్లో పార్కును 50 ఎకరాల్లో ఏర్పాటు చేసింది. ఎఫ్‌టీసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసింది. ఇందులో 26 పరిశ్రమలు ఏర్పాటు చేశారు. జిన్నారం మండలం శివానగర్‌లో ప్రభుత్వం 120 ఎకరాల్లో ఎల్ఈడీ పార్కును ఏర్పాటు చేస్తోంది. ఎల్ఈడీ పార్కులో వంద పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

కేసీఆర్ హయాంలో మెతుకు సీమ ప్రగతి బాట

- సమైక్య రాష్ట్రంలో అభివృద్ధికి ఆమడ దూరం ఉమ్మడి మెదక్ జిల్లా
- ఒక్క ప్రాజెక్టు కట్టని కాంగ్రెస్ సర్కారు
- వాస్తవాలను వక్రీకరించిన సీఎం రేవంత్
- బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో వందేండ్ల అభివృద్ధి
- జిల్లాకో మెడికల్ కళాశాల, వందలాది పరిశ్రమల ఏర్పాటు
- పెద్దఎత్తున సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం
- మౌలిక వసతుల కల్పన

సిద్దిపేట, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సమైక్య రాష్ట్రంలో మెదక్ జిల్లా అన్నిరంగాల్లో దగాకు గురైంది. అప్పటి ప్రభుత్వాలు జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కట్టాలన్న ఆలోచన చేయలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు మహర్దశ వచ్చింది. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో వందేండ్ల అభివృద్ధి జరిగింది. రిజర్వాయర్లు, నూతన కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. సమైక్య పాలనలో నిత్యం కరువు కాటకాలు, తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు, రైతు ఆత్మహత్యలు, ఆకలి చావులతో అల్లాడిన మెతుకు సీమ.. కేసీఆర్ హయాంలో పచ్చని పంటల మాగాణంగా మారింది.

సాగు, తాగునీటికి పెద్దపీట

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లా మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులను వేల కోట్ల రూపాయలు వెచ్చించి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. దీంతో లక్షల ఎకరాలకు సాగునీరు అంది గడిచిన ఐదారేండ్లుగా ఈ ప్రాంతంలో భూమికి బరువయ్యేలా పంటలు పండాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ చేపట్టడంతో భూగర్భ జలాలు పెరిగి ఆయకట్టు కింద సాగు పెరిగింది. మెదక్ జిల్లాలో ఘణపూర్ ప్రాజెక్టుకు వంద కోట్ల రూపాయలు ఖర్చుచేసి పూర్తవైభవం తెచ్చారు. సింగూరు ప్రాజెక్టుకు కాళేశ్వరం లింకు కలిపారు. సంగారెడ్డి జిల్లాలో బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పనులకు కేసీఆర్ భూమిపూజ చేశారు.

మెడికల్ కళాశాలల ఏర్పాటు...

సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్‌లో మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గజ్వేల్‌లో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేసి విద్యారంగాన్ని బలోపేతం చేసింది. సిద్దిపేటలోని ఐటీ టవర్, సిద్దిపేటలోని ఆటోనగర్ ఏర్పాటు చేసింది. చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలు తెచ్చి ఉపాధి అవకాశాలను కల్పించింది.

సాకారమైన రైలు కల...

రైలు సౌకర్యం లేని మెదక్ ప్రాంతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రైలు కల సాకారం చేసింది. మెదక్ నుంచి అక్కన్నపేట వరకు సుమారు 17 కిలోమీటర్ల రైల్వేలైన్ బీఆర్ఎస్ హయాంలో జరిగింది. రైల్వేలైన్‌కు కావాల్సిన భూసేకరణ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి ఇవ్వడంతోనే రైలు కల సాకారమైంది.

సిద్దిపేట జిల్లాలో నిర్మించిన రంగనాయక సాగర్ ప్రాజెక్టు

నిమ్జ్‌తో పెట్టుబడుల వరద

జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్) ఏర్పాటుపై కేసీఆర్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. కేసీఆర్ సర్కార్ భూసేకరణతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించింది. నిమ్జ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవడంతో బడా కంపెనీలు తరలివస్తున్నాయి. 12,635 ఎకరాల్లో నిమ్జ్ ఏర్పాటు అవుతున్నది. నిమ్జ్ ప్రాజెక్టు వ్యయం 13,300 కోట్లు కాగా, 60వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. నిమ్జ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా కేసీఆర్ సర్కార్ విద్యుత్, నీటి సౌకర్యంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించింది. రూ.100 కోట్లతో ఎల్లోయి శివారు వరకు ప్రత్యేకంగా నాలుగు లేన్ల రోడ్డు నిర్మించింది.అప్పటి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ గత ఏడాది నిమ్జ్‌లో వెమ్‌టెక్నాలజీకు సంబంధించిన తొలి పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. వెమ్ టెక్నాలజీ రూ.1000 కోట్లతో ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ సిస్టమ్ ఫెసిలిటీ ఏర్పాటు చేస్తోంది. ట్రైటాన్ కంపెనీ రూ.2100 కోట్ల పెట్టుబడులతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. జర్మనీకి చెందిన లైట్ ఆటో వంద ఎకరాల్లో రూ.1500 కోట్లతో ఈ వెహికిల్ తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తోంది. తద్వారా 9వేల మందికి ప్రత్యక్షంగా, 18వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. నిమ్జ్‌లో డిఫెన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి సంబంధించి పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. సంగారెడ్డి నియోజకవర్గంలోని కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామంలో మోమిన్ ఇండియా రూ.300 కోట్లతో పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నది. గతేడాది అప్పటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కంపెనీ ఏర్పాటుతో 500 మందికి ఉపాధి లభిస్తుంది.

జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున రెండోసెట్ నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్, హన్మంత్‌షిండే

మూడోరోజు 4 నామినేషన్లు

- జహీరాబాద్ పార్లమెంట్‌కు మొత్తం 8 మంది అభ్యర్థుల నామినేషన్
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీతో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ నామినేషన్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శనివారం మూడోరోజు 4 నామినేషన్లు దాఖలయ్యాయి. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఇప్పటికే నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేయగా, తాజాగా మరో నలుగురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతికి అందజేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్ నామినేషన్ వేశారు. అనంతరం జహీరాబాద్ ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి తదితరులు అనిల్‌కుమార్ తరపున మరోసెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులు ప్రవీణ్, కొత్త బలిజ బస్వరాజ్, రామారావు పాటిల్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇప్పటికే ఒక సెట్ నామినేషన్ రెండోరోజు వేసిన స్వతంత్ర అభ్యర్థి మారుతిరావు, మూడోరోజు మరో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. దీంతో జహీరాబాద్ స్థానానికి ఇప్పటివరకు 8 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఇందులో గాలి అనిల్ కుమార్, మారుతిరావు, మహాదేవ్ స్వామి రెండు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

హత్యా రాజకీయాలను సహించం

- శ్రీనివాస్ హత్య దారుణం
- గొడవకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకే కాంగ్రెస్ దౌర్జన్యం
- కాంగ్రెస్ ఆగడాలను అరికట్టకపోతే ప్రతిచర్య తప్పదు
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 20: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యాలకు పాల్పడుతూ బీఆర్ఎస్ నాయకులపై దాడులకు దిగుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న హత్యారాజకీయాలను సహించబోమని నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం నారాయణఖేడ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిర్గాపూర్ మండలం సింగార్‌బొగుడ తండాల్లో సీసీరోడ్డు పనుల విషయంలో జరిగిన గొడవ కారణంగా కాంగ్రెస్ కార్యకర్తలు, బీఆర్ఎస్ కార్యకర్త వడిత్య శ్రీనివాస్‌పై దాడి చేసి హత్యచేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. శ్రీనివాస్‌ను పంచాయతీ పేరుతో పిలిచి దాడికి పాల్పడడంతో దవాఖానకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడన్నారు. కొన్ని రోజుల క్రితం బాణాపూర్ మాజీ సర్పంచ్ భర్త చన్బసప్పపై కూడా కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడంతో బలమైన గాయాలయ్యాయన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో ఇటువంటి ఘటనలు జరుగకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించే విధంగా కృషి చేశానన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిగా సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు దుశ్చర్యలు ఆపకపోతే ప్రతిచర్య తప్పదని హెచ్చరించారు. నారాయణఖేడ్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలని కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు భూపాల్‌రెడ్డి కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నారాయణఖేడ్ మండల అధ్యక్షుడు పరమేశ్, పెద్దశంకరంపేట జడ్పీటీసీ విజయరామరాజు, నాయకులు రవీందర్‌నాయక్, నజీబ్, బాసిత్, ముజామిల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాత పెట్టాలి

- అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- రాష్ట్రానికి బీజేపీ చేసింది శూన్యం..
- కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలబెట్టింది...
- కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ప్రజల కోసం పనిచేసే జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి
- మాజీ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్ర